సాక్షి 24/7
తూర్పుగోదావరి
బుధవారం 24-7-2019
EAST GODAVARI
గరిష్టం 33.0°/ కనిష్టం 27.0°

# పట్టాభిషేకానికి గ్రీన్ సిగ్నల్

- 27న జేఎన్‌టీయూకే ఏడో స్నాతకోత్సవానికి ఏర్పాట్లు
- బీహెచ్ఈఎల్ మాజీ సీఎండీ ప్రసాదరావుకు గౌరవ డాక్టరేట్



జేఎన్‌టీయూకే

**బాలాజీచెరువు (కాకినాడ సిటీ):** అతిరథ మహాశయుల చేతుల మీదుగా సంప్రదాయ వస్త్రధారణలో బంగారు పతాకలు, పట్టాలు తీసుకోవాలని ఏడాదిన్నరగా కలలు కంటున్న విద్యార్థుల కల మరో నాలుగు రోజుల్లో సాకారం కానుంది. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్ఐటీ, పెట్రోలియం వంటి కోర్సులు పూర్తి చేసుకొని ప్రముఖులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో పట్టా అందుకోవాలనుకున్న వారి కల నెరవేరేందుకు ముహూర్తం ఖరారు చేశారు. వర్సిటీ నిబంధనల ప్రకారం ఏటా స్నాతకోత్సవం నిర్వహించాల్సి ఉండగా 2018 జనవరిలో అప్పటి వీసీ వీఎస్ఎస్ కుమార్ ఆధ్వర్యంలో 6వ స్నాతకోత్సవం నిర్వహించగా, తాజాగా ఏడాదిన్నర తరువాత ఏడో స్నాతకోత్సవానికి ప్రస్తుత వీసీ రామలింగరాజు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ సుబ్బారావు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ఇప్పటికే స్నాతకోత్సవానికి సంబంధించి జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ సుబ్బారావు నోటిఫికేషన్ జారీ చేశారు. 2014–18 సంవత్సరానికి సంబంధించి జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలలు ఎనిమిది జిల్లాల ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో బీటెక్ ,లేదా ఎంటెక్ పూర్తి చేసిన అభ్యర్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నారు. వీటితో పాటు జేఎన్‌టీయూకే ద్వారా పరిశోధన పత్రాలు సమర్పించిన 129 మందికి గౌరవ డాక్టరేట్లు అందజేస్తున్నారు.

## ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు..

వర్సిటీ ప్రతిష్టను నిలిపే స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే కమిటీలు నియమించి వారికి కేటాయించాల్సిన విధులపై చర్చించాం. రిజిస్ట్రార్ హోదాలో రెండో స్నాతకోత్సవం నిర్వహించడం సంతోషంగా ఉంది.

**- విస్సాకోడేటి వెంకట సుబ్బారావు, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూకే**



### రిజిస్ట్రార్ పదవీ కాలం ముగియడంతో...

రిజిస్ట్రార్ పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం ఇన్‌చార్జి హోదా కొనసాగుతోంది. కొత్తగా నియమితులైన రిజిస్ట్రార్ హయాంలో వేడుకలు నిర్వహిస్తారని అందరూ అనుకున్నారు. అయితే రిజిస్ట్రార్ పదవీ కాలం ముగియడం, దానికి తోడు కొత్త ప్రభుత్వం రావడంతో సుబ్బారావు హయాంలో స్నాతకోత్సవం జరగదంటూ కొంత మంది అధ్యాపకులు వాదనలు చేసుకున్న తరుణంలో ప్రతిష్టాత్మకంగా ఇప్పుడు తేదీ ఖరారు కావడం, వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం చేయడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



### బీహెచ్ఈఎల్ మాజీ సీఎండీ ప్రసాదరావుకు గౌరవ డాక్టరేట్

అలాగే ముఖ్య అతిథిగా భారత్‌హెవీఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్ఇఎల్)సీఎండీ బి.ప్రసాదరావుకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్నారు. గత ఆరో స్నాతకోత్సవానికి పద్మశ్రీ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డికి అప్పటీ వీసీ రామలింగరాజు డాక్టరేట్ ప్రదానం చేశారు.

### ఎండోమెంట్ బంగారు పతకాలు

ఇంజినీరింగ్ విభాగాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి ప్రొఫెసర్ అల్లం అప్పారావు బంగారు పతకం, ఈసీఈ టాపర్‌కు ప్రొఫెసర్ వీవీఎల్ రావు మెమోరియల్ ఎండోమెంట్ పతకం అందజేయనున్నారు. యూసీఈకే ఈసీఈ టాపర్‌కు డాక్టర్ ఎంఎం సంజీవరావు, సీఎస్ఈ టాపర్‌కు కంప్యూటర్ సొసైటీ కార్పొరేషన్ బంగారు పతకం, పెట్రోలియం ఇంజినీరింగ్ విభాగంలో కామిరెడ్డి వీర్రాజు అన్నపూర్ణ మెమోరియల్ బంగారు పతకం అందజేయనున్నారు.